

తప్పిన మెడి'కళ'

అరకొర సౌకర్యాల మధ్య మహేశ్వరం మెడికల్ కాలేజీ

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలోనే బీఎస్సీ నర్సింగ్

7



ఆదర్శనగర్ గ్రౌండ్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ముత్యాల ముగ్గులు మురిపించాయి. ప్రతీ ముగ్గులో ఏదో ఒక వైవిధ్యం. సంస్కృతి, సంప్రదాయాలను ఆయా రంగవల్లుల్లో ప్రతిబింబించారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్) సహకారంతో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. తాండూరు పట్టణం ఆదర్శ నగర్ (పాత కుంట)లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 138 మంది మహిళలు, విద్యార్థినులు పాల్గొని ఉత్సాహంగా ముగ్గులు వేశారు.

ముగ్గు.. మురిపెం

అలరించిన ముత్యాల ముగ్గుల పోటీలు

ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు అనూహ్య స్పందన

- మహిళలతో సందడిగా ఆదర్శనగర్ గ్రౌండ్
- ఉత్సాహంగా ముగ్గులు వేసిన యువతులు
- ఆకట్టుకున్న వినూత్న రంగవల్లులు
- పోటీల్లో పాల్గొన్న 138 మంది మహిళలు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- సంస్కృతిని ప్రతిబింబించిన ముగ్గులు

తాండూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం ఆదర్శ నగర్ (పాత కుంట)లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినూత్నమైన రంగవల్లులతో ఆకట్టుకున్నారు. ఈ పోటీలకు స్పాన్సర్‌గా తాండూరు ఎమ్మెల్యే, బీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి అరుణ మనోహర్‌రెడ్డి వ్యవహరించారు. వికారాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కె. కరుణ శ్రీ, జేఎల్ ఎస్.చంద్రరేఖ, గీతా ప్రచార కర్త కె.జయశ్రీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ముగ్గుల పోటీలను ఆర్బీఎల్ ఎండీ. సరళ శ్రీనివాస్‌రెడ్డి ముగ్గు వేసి ప్రారంభించారు. అనంతరం సంతూర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) బహుమతులను ముగ్గు వేసిన మహిళలు మధులత, మేనకలకు అందజేశారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి(రూ.6వేలు) కె. మంజుల, శివాజీ చౌక్(తాండూరు), ద్వితీయ బహుమతి (రూ.4వేలు)- సి.ఇంద్రజ, వాల్మీకి నగర్(తాండూరు), మూడో బహుమతి (రూ.3వేలు), వై.మంజుల(పరిగి), అలాగే సి. సువర్ణ(తాండూరు) కన్సోలేషన్ బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా..

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా మహిళల్లో ఉన్న నైపుణ్యాన్ని బయటికి తీసి ముత్యాల ముగ్గుల పోటీలు

మిగతా 8వ పేజీలో...



గ్రౌండ్‌లో వేసిన స్పాన్సర్ల లోగోలు



మొదటి విజేత మంజులకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి





మహిళలను ప్రోత్సహించడం సంతోషకరం

ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో కొన్నేళ్లుగా పాల్గొంటున్న. ఈసారైన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలవాలని ఉంది. గతంలో వికారాబాద్, మర్పల్లిలో నిర్వహించిన పోటీల్లో రెండో బహుమతి పొందాను. ఈ సారి తాండూరులో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానం పొందడం సంతోషంగా ఉంది. ప్రతీ యేడాది ఆంధ్రజ్యోతి మహిళలకు పోటీలు నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహించడం సంతోషకరం.

-కె.మంజుల, శివాజీ చౌక్(తాండూరు), మొదటి బహుమతి విజేత





చాలా సంతోషంగా ఉంది

ఈ ముగ్గుల పోటీ ప్రతీ యేడాది మహిళలను ప్రోత్సహిస్తున్నారు. మున్ముందు కూడా మహిళలు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించాలి. సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా ముగ్గులను అలంకరణ చేశాను. చాలా మంది ఈ ఏడాది పోటీల్లో పాల్గొన్నప్పటికీ నాకు బహుమతి రావడం ఆనందంగా ఉంది.

-సి. ఇంద్రజ, వాల్మీకి నగర్(తాండూరు), రెండో బహుమతి విజేత





ప్రతీ ఏడు పాల్గొంటాను

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ ఎక్కడ పెట్టినా నేను పాల్గొంటాను. నేను 40 కి.మీటర్ల దూరంలోనున్న పరిగి ప్రాంత వాసిని .అయినా తాండూరులో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనడం, బహుమతి పొందడం సంతోషంగా ఉంది. ఈ పోటీలు నిర్వహించిన ఆంధ్రజ్యోతి వారికి అభినందనలు.

-వై. మంజుల పరిగి, మూడో బహుమతి విజేత

'ప్రైవేట్'లో దోపిడీ!

పరిగిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యం

- ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న క్లినిక్‌లు
- వచ్చీరాని వైద్యంతో ప్రాణాలు హరీ!
- శస్త్రచికిత్సల పేరుతో దండుకుంటున్న వైనం
- నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా.. సర్జరీలు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు
- ఆందోళనలో స్థానిక ప్రజలు

ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌ల పేరుతో గ్రామీణ పేదలను వైద్యం పేరిట దోపిడీ చేస్తున్నారు. ఎలాంటి అర్హత లేకున్నా ఇబ్బముబ్బడిగా ఆస్పత్రులను తెరుస్తున్నారు. వైద్యం కోసం డబ్బులు ఖర్చుపెడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న పేదల ప్రాణాలను తీస్తున్నారు. పరిగి పట్టణంలో ఏర్పాటు చేసిన పలు క్లినిక్స్‌లో వైద్యం మాట అటుంచితే వచ్చీరాని వైద్యంతో శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు తీస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించే నాథుడు లేకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాట అన్నచందంగా మారింది. వైద్య శాఖ అధికారులు సైతం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

పరిగి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో పదో తరగతి అర్హత లేని వారు సైతం ఏకంగా నర్సింగ్‌హోంలను తలపించేలా క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరం లేకున్నా డబ్బుల కోసం రోగులను నమ్మించి సొమ్ము చేసుకుంటున్నారు. కాసుల కోసం ప్రైవేటు ఆస్పత్రులు, కమిషన్ కోసం ఆర్ఎంపీ వైద్యులు అమాయక మహిళలను బలి చేస్తున్నారు. కడుపునొప్పి, నడుమునొప్పి అని వెళితే చాలు.. గర్భసంచి తొలగించేస్తున్నారు. వేలకు వేలు దండుకుంటూ గిరిజన తండాలు, గ్రామాల్లోని మహిళల ఆరోగ్యాన్ని హరించడంతోపాటు ఉన్నకాడికి దోచుకొని రోడ్డు మీద పడేస్తున్నారు. అలాగే గర్భిణులకు నార్మల్ డెలివరీ అయ్యే పరిస్థితి ఉన్నా.. సిజేరియన్ తప్పనిసరి అంటూ డబ్బులు దండుకుంటున్నారు.

నెలకు ఒకరిద్దరు..

పరిగి కేంద్రంగా మహిళలకు గర్భసంచి తీసేసే శస్త్రచికిత్సలు పదుల సంఖ్యలో చేస్తున్నారు. ఈ సర్జరీకి ఒక్కో మహిళ నుంచి రూ.60 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా నెలకు. రూ.కోటికిపైగా లావాదేవీలు ఆయా ఊరుపేరు లేని క్లినిక్‌లలో జరుగుతున్నట్లు అంచనా. ఇక మందులు, పరీక్షలు ఖర్చులు అదనంగానే వసూలు చేస్తున్నారు. ఆయా క్లినిక్‌లలోకి కేసును తీసుకొచ్చే వారికి కూడా కమీషన్ ఇస్తున్నారు. ఇటీవల సాధన ఆస్పత్రిలో గర్భసంచి ఆపరేషన్ చేయడంతో ఓ మహిళ

మిగతా 8వ పేజీలో...



సాధన ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు(ఫైల్)

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పేదల ప్రాణాలతో ఆడుకోవద్దు. అర్హత లేకుండా నిర్వహిస్తే సీజ్ చేస్తాం. ఇప్పటికే పరిగిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటిని సీజ్ చేశాం. ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అనుమతి రద్దుతో పాటు క్రిమినల్ కేసులు పెట్టిస్తాం.

-వెంకటరమణ, డీఎంహెచ్‌వో, వికారాబాద్

మహిళా అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

కొడంగల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాస్, ఇంటర్ పాస్ లేదా ఫెయిలైన 25 సంవత్సరాల్లోపు మహిళా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలో ఉన్న అమర్‌రాజ ఫ్యాక్టరీలో మొదటి ఆరునెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో నెలకు రూ.12వేలు స్టయిఫండ్ అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం మహబూబ్‌నగర్‌లోని అమర్‌రాజ ఫ్యాక్టరీలో ఉద్యోగంతో నెలకు రూ.15వేలు వేతనం అందిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు తమ బయోడెటా, సర్టిఫికెట్స్‌తో సోమవారం ఉదయం 10 గంటలకు కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

నేడు పోలెపల్లిలో భూ సర్వే

దుద్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు దుద్యాల మండలంలోని పోలెపల్లిలో సోమవారం భూసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ శివారులో గల సర్వే నెం.67లోని ప్రభుత్వ భూమిలో భూసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ హద్దులను చూయించాలని కోరారు.



రంగనాయకస్వామి ఆలయంలో సుదర్శన హవనం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

లోక కల్యాణార్థం 'సుదర్శన హవనం'

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసమే సుదర్శన హవనం పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీమన్నారు రంగనాయక స్వామి ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన హవనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 11ఏళ్లుగా ప్రతీనెల మొదటి ఆదివారం ఆలయంలో సుదర్శన హవనం నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుప్పావై ఆలకించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారిని, స్వామిని ఆలంకరించి సుదర్శన హవనం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెల్లడించారు. ఈ హవనానికి వచ్చిన డబ్బులను ఆలయాభివృద్ధికి, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. గ్రామంతో పాటు నగరం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అర్చనలు, తీర్థ, ప్రసాదాల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ రాజగోపాలచార్యులు, అనంత సేనామాచార్యులు, పురుషోత్తామాచార్యులు, సేషాచార్యులు, ఫణికుమారాచార్యులు, పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, అదిత్యాచార్యులు, శ్రీవత్సవాచార్యులు, శ్రీపతిచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్

ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం

వికారాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని వికారాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆదివారం రాష్ట్ర గెటిటెడ్ ప్రధానోపాధ్యాయుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు ఐడీ కార్డుల పంపిణీ, క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ రమేష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.హరిలాల్, జిల్లాప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి, ట్రెజరర్ డి.రాములు, పాండు, సంఘం నాయకులు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'పిట్టల'కు అభ్యుదయ రైతు పురస్కారం

ప్రకృతి సేద్య రైతుకు అరుదైన గౌరవం

పురస్కారం అందజేసిన ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

7

అబద్ధాలకు కేరాఫ్ కాంగ్రెస్

దశాబ్దాలుగా రైతులను మోసం చేస్తున్నారు

రైతు భరోసా విషయంలో మరోసారి..: మెతుకు ఆనంద్

8

హిందూ ధర్మం దేశానికి శ్రీరామరక్ష



పరిగిలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రాఘనందన్‌రావు

పరిగి,జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం, జాతీయవాదమే దేశానికి శ్రీరామరక్ష అని మెదక్ ఎంపీ రాఘనందన్‌రావు అన్నారు. పరిగి పట్టణంలో ఆదివారం ప్రముఖ రచయిత డాక్టర్ భాస్కరయోగి ఆధ్వర్యంలో నిర్వహించిన పుష్య సత్సంగం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రపంచంలో జరుగుతున్న ఘర్షణలు, అలజడులకు పరిష్కారం సనాతన ధర్మంలో ఉన్నదని చెప్పారు. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచమంతా హిందుత్వం వైపు చూస్తే, ఇక్కడి పరిస్థితులేమో లౌకికత్వాన్ని వాదిస్తాయని ఆరోపించారు. అనంతరం రచయిత భాస్కరయోగి మాట్లాడుతూ.. శాస్త్రం ఆధారంగా జీవన విధానంతోపాటు, సంప్రదాయాలను అనుసరిస్తే భగవంతుడి కరుణ ఉంటుందని పేర్కొన్నారు. సమర్థుడైన గురువు ఆధ్వర్యంలోనే పరిపూర్ణ జ్ఞానం వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు కరణం ప్రహ్లాదరావు, నాయకులు శివరాజు, వార్ల అంజనేయులు, నరేందర్‌రెడ్డి, టీవీ నర్సింహులు, రాముయాదవ్, రామ్‌చందర్, బాలకృష్ణారెడ్డి పాండురంగాచారి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వెయ్యి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మండల కమిటీ ఎన్నికలో ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దేముల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్‌మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జి స్వామిదాస్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉమాశంకర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శి హెచ్.రవీందర్ మాదిగ, కార్యదర్శిగా డబ్బుల నర్సింహులుమాదిగ, మామిడి అశోక్‌మాదిగ, అధికార ప్రతినిధిగా జగదీశ్‌మాదిగ, సలహాదారుగా పిల్లి రాములుమాదిగ, కార్యవర్గ సభ్యులుగా పిరంగల్ల రాజుమాదిగ, కవిరాజుమాదిగ, ప్రేమ్‌కుమార్ మాదిగ నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హరిసూదన్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

66వ రోజుకు రిలే దీక్షలు

తలకొండపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్‌చైర్మన్ శరత్ చంద్ర, ఆంజనేయులు గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 66వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం ఏర్పాటులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. కేబినెట్ సమావేశంలో 11 మండలాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు తీర్మానించారని, అందులో గట్టిప్పలపల్లిని చేర్చకపోతే ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కృష్ణయ్య, సాయిరామ్, విజేందర్, రమేశ్‌గౌగడ్, రమేశ్, మనోహార్,ఇంద్రకంటి కృష్ణయ్య, వెంకటయ్య, మాధవులు, పద్మమ్మ, వసంత, జంగిలి, చంద్రయ్య, జంగమ్మ, రాములమ్మ, సుజాత, వెంకట్రావ్ పేట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయం అభినందనీయం


మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించడం హర్షదాయకమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ అన్నారు. ఆమనగల్లులో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనకు జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని కేబినెట్‌లో ఏకగ్రీంగా తీర్మానం చేయడం గర్వకారణమన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కల్వకుర్తి భూములు సస్యశ్యామలం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

జగన్‌కు పండుగ సాయన్న పురస్కారం


జగన్‌కు పురస్కారం అందజేస్తున్న ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్

ఆమనగల్లు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన బీసీ కులాల ఐక్యవేదిక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల జగన్ పండుగ సాయన్న రాష్ట్ర స్థాయి సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు జగన్ తెలిపారు. పేదలకు చేస్తున్న సేవలకు ఈ పురస్కారం దక్కినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, చంద్రశేఖర్, లక్ష్మీపతి, సంపత్, నర్సింహారావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో లక్ష్మయ్య సేవలు మరువలేనివి


పీఆర్ డిప్యూటీ ఈఈని సన్మానిస్తున్న గుడిసె లక్ష్మణ్, తదితరులు

వికారాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన డిప్యూటీ ఈఈ లక్ష్మయ్య సేవలు మరువలేనివని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్ అన్నారు. కులకచర్ల పీఆర్ డిప్యూటీ ఈఈగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మయ్యను వికారాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మయ్య ఇంజినీరింగ్ శాఖలో పనిచేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఉమేశ్‌కుమార్, కాంట్రాక్టర్ల సంఘం జిల్లా నేత రహీం, రత్నం పాల్గొన్నారు.

పిట్టల శ్రీశైలంకు అభ్యుదయ రైతు పురస్కారం


శ్రీశైలంకు పురస్కారం అందజేస్తున్న ఏపీ మంత్రి అచ్చెంనాయుడు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుశాపూర్‌కు చెందిన ప్రకృతి సేద్య రైతు పిట్టల శ్రీశైలంకు ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు అభ్యుదయ రైతు పురస్కారం అందజేశారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభ్యుదయ రైతు పురస్కారాల్లో భాగంగా ఆయనకు ఈ అవార్డు లభించింది. ఒక ఎకరంలో ప్రకృతిసిద్ధంగా లాభదాయకమైన ఆర్గానిక్ పంటలు పండించిన శ్రీశైలం ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, రైతు నేస్తం చైర్మన్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పిట్టల శ్రీశైలం అభ్యుదయ రైతు అవార్డు అందుకున్నారు.

పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి


నందివనపర్తిలో సమావేశమైన నిషేధిత జాబితాలో ఉన్న రైతులు

యాచారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులను ఆదుకోవాలని ఫార్మాసిటీ బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నందివనపర్తిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవుల సరస్వతి మాట్లాడారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలిగించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పట్టాభూములున్న రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలు రైతులకందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మాసిటీ రద్దు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. పట్టాభూముల క్రయ విక్రయాలు జరిగేందుకు వీలు కల్పించాలని కోరారు. పట్టా భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో అప్పుల పాలవుతున్న విషయం ప్రభుత్వం గమనించాలన్నారు. సమావేశంలో నారాయణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

శంషాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కార్మికుల సమావేశం నిర్వహించారు. పర్వతాలు మాట్లాడుతూ ఏప్రిల్ 21, 22వ తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, గిరి, హరిసింగ్, కేతరాజు తదితరులున్నారు.

లబ్ధిదారుడికి చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండకు చెందిన సురేశ్‌కు మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం ఆయన నివాసంలో అందించారు. సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, నార్సింగ్ ఏఎంసీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కుమార్ యాదవ్, దేవేందర్, నజీర్, డి.భిక్షపతి, సమీర్ తదితరులున్నారు.


ప్రస్తుతం కొనసాగుతున్న మెడికల్ కళాశాల భవనం

- ప్రైవేటు భవనం కూడా అందుబాటులోకి రాని వైనం
- వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలోనే బీఎస్సీ నర్సింగ్ కొనసాగింపు



తప్పిన మెడికళ

అరకొర సౌకర్యాల మధ్య మహేశ్వరం మెడికల్ కాలేజీ

ఇబ్రహీంపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో నూతనంగా మంజూరు చేసిన మహేశ్వరం మెడికల్ కళాశాల ఇబ్రహీంపట్నం పరిధిలోని మంగల్‌పల్లి భారత్ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతుంది. ముందుగా దీనిని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ప్రారంభించగా గతేడాది అక్టోబర్‌లో ఇక్కడకు మార్చారు. ఇక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భవనం తరగతుల నిర్వహణకే సరిపోతుంది. నిజానికి మెడికల్ కళాశాల కోసం యాజమాన్యం చూపిన భవనం ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇది పూర్తయితేనే క్లాసుల నిర్వహణ, ప్రాక్టికల్స్, లైబ్రరీ, హాస్టల్ వసతి వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

నెలకు రూ.16 లక్షల అద్దె

మెడికల్ కళాశాల ప్రారంభ సమయంలో నెల రోజుల్లో నిర్మాణం పూర్తవుతుందనుకుంటే పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుత భవనాలకు నెలకు రూ.16 లక్షలు అద్దె చెల్లిస్తున్నారు. ఈ కళాశాలలో మొదటి సంవత్సరం మొత్తం 50 ఎంబీబీఎస్ సీట్లకు అన్నీ భర్తీ చేశారు. అన్ని శాఖలకు సంబంధించి ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. ల్యాబ్స్, యంత్ర పరికరాలు కొంత మేరకే అందుబాటులో ఉన్నాయి. ప్రాక్టికల్స్ ఎలాగోలా కొనసాగిస్తున్నారు. లైబ్రరీ సౌకర్యం లేదు. విద్యార్థులు, ఫ్యాకల్టీకి సరిపడా టాయిలెట్స్ అందుబాటులో లేవు. ఫ్యాకల్టీకి వేర్వేరుగా గదులు ఉండాల్సి ఉంది. తాగు నీటి వసతి కూడా సరిగా లేదు. అంతేగాక విద్యార్థులకు ఇక్కడ హాస్టల్ సదుపాయం లేకపోవడంతో బయట ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్నారు. ఫ్యాకల్టీ పూర్తిగా హైదరాబాద్ నుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న భవనం అందుబాటులోకి వస్తే తప్ప తరగతులు, ప్రాకికల్స్ నిర్వహణకు సౌకర్యంగా ఉంటుంది. ఈ కళాశాలకు అనుబంధంగా బీఎస్సీ నర్సింగ్ కళాశాల నవంబర్ నెలలో ప్రారంభమైనప్పటికీ భవన వసతి లేనికారణంగా అది వనస్థలీపురం ఏరియా ఆస్పత్రిలో కొనసాగుతుంది. ఇక్కడ కళాశాల వరకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఫ్యాకల్టీ నాగార్జునసాగర్ రహదారి మంగల్‌పల్లి గేట్ వద్ద దిగి ఒకటిన్నర కిలోమీటర్లు కాలినడకనే రావాల్సి వస్తుంది.

భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

ప్రస్తుతం ఉన్న భవనం తరగతుల నిర్వహణకే సరిపోతుంది. ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇబ్బందిగా ఉంది. నిర్మాణంలో ఉన్న భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలి. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇక్కడ సరిపడా ఫ్యాకల్టీ ఉంది. ఉన్నంతలో విద్యార్థులకు బోధన ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ వస్తున్నాం. కమ్యూనిటీ మెడికల్ సబ్జెక్టు, ఫీల్డ్ విజిట్ కోసం ప్రత్యేకంగా ఓ వాహనం కావాలి.

- డా.బి.త్రివేణి, మహేశ్వరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

బస్సు లేక బాధలు పడుతున్నం

మెడికల్ కళాశాల వరకు బస్ సౌకర్యంలేక ఇబ్బంది పడుతున్నం. బైక్‌పై వచ్చే విద్యార్థుల వాహనాలను కూడా ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ గేట్ వద్దే నిలిపి వేయడంతో అర కిలోమీటర్ నడిచి వెళ్లాల్సి వస్తున్నది. కళాశాల ప్రాంగణంలో హాస్టల్ వసతిలేక బయట హాస్టళ్లలో ఉండాల్సి వస్తోంది. దీంతో చదువులకు ఇబ్బందిగా మారింది. సరిపడా టాయిలెట్స్ లేవు. తాగు నీటికికూడా ఇబ్బందిగా ఉంది.

- నిహారిక, ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం

పరిమళించిన మానవత్వం


ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

కందుకూరు జనవరి 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పెద్దోళ్ల ప్రశాంత్‌రెడ్డి డిసెంబర్ 28న డ్యూటీ ముగించుకొని హైదరాబాద్‌లోని తన ఇంటికి బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు ఆయన తండ్రి నాగిరెడ్డి, మృతుడి భార్య సౌమ్య ముందుకు వచ్చి మృతి చెందిన ప్రశాంత్‌రెడ్డి అవయవాలు(కిడ్నీలు, కాలేయం) జీవన్‌దాన్‌కు అప్పగించారు. ఆదివారం ఉప్పల్‌లో జరిగిన అంత్యక్రియలకు రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు రూ.90 వేలు మంజూరు చేసినట్లు సీఐ సీతారాం తెలిపారు. రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి ప్రశాంత్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందాలి

యాచారం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో చల్లాను యాచారం మండల కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి సత్కరించారు.

బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

- బీసీల ఓట్లు లేకుండా వార్డుమెంబర్ కూడా గెలువలేరు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


కొర్రెములలో నిర్వహించిన బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఐక్యత చాటుతూ అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చాడు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల జీకే కన్వెన్షన్‌లో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు అధ్యక్షతన ఆదివారం 'పంచాయతీ ఎన్నికలు - బీసీల పాత్ర'పై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అగ్రవర్ణాలకే ప్రాధాన్యం ఇస్తూ బీసీలను ఎదుగనివ్వలేదని ఆరోపించారు. బీసీలు బాంచన్ దొర పద్ధతిని విడిచిపెట్టాలని, రాజకీయంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, గెలిచేవిధంగా వ్యూహాత్మక ఎత్తుగడలు అవలంబించాలని సూచించారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో బీసీలు అధికంగా పాల్గొని అధికారం చేపట్టాలని పిలుపునిచ్చారు. బీసీల మద్దతు లేకుండా ఒక్క వార్డు మెంబర్ కూడా గెలవలేడని, బీసీలను అడ్డంపెట్టుకొని అగ్రవర్ణాల వారు అధికారం చేపడుతున్నారన్నారు. సంఘసంస్కర్తలైన జ్యోతిరావు బాయి పూలే, సావిత్రిబాయి పూలేలకు భారతరత్న ఇవ్వాలని, పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ మధుసుదనాచారి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, తుల ఉమా, మాజీ ఐఏఎస్ ప్రభాకర్‌చారి, జానయ్య, సూర్యరావు, అర్జున్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామ్యేల్

'హెచ్‌ఎంపై దాడి' నిందితులను అరెస్టు చేయాలి

మహేశ్వరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప స్వాముల ముసుగులో దాడికి పాల్పడ్డవారిని అరెస్టు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామ్యేల్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారత్ అన్నారు. అయ్యప్పమాలతో ఉన్న విద్యార్థిని హెచ్‌ఎం కొట్టాడనే నెపంతో కొందరు అయ్యప్ప మాలదారులు, పలువురు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు హెచ్‌ఎంపై దాడి చేయడం విడ్డూరమని అన్నారు. ఈమేరకు వివిధ సంఘాల నాయకులతో ఆదివారం మహేశ్వరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభ్య సమాజం తల దించుకునేలా ఓ హెచ్‌ఎంను కొట్టడమే కాకుండా.. విద్యార్థి కాళ్లు మొక్కించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సుమలత, విజయ, రవికుమర్, బాల్‌రాజ్, జాన్, తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 5, (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 98 మంది లబ్ధిదారులకు ఎల్‌వోసీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్, యాలాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 42 లక్షల విలువైన ఎల్‌వోసీలు అందజేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించి పేదలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు పట్లోళ్ల బాల్‌రెడ్డి, కోటబాస్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బషీరాబాద్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కౌన్సిలర్లు పట్లోళ్ల నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాము, సోమశేఖర్, కాంగ్రెస్ పట్టణ యూత్ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్, మహిపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, గాజుల మాధవి పాల్గొన్నారు.

అన్నదాతలను మోసగిస్తున్న కాంగ్రెస్


మాట్లాడుతున్న రమేష్

మంచాల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చీరాల రమేష్ విమర్శించారు. ఆదివారం మంచాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, రవి, జ్ఞానేశ్వర్, కిషన్‌రెడ్డిలతో కలిసి మాట్లాడారు. రైతులకు ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుబరోసా పథకాన్ని అమలుచేస్తామని చెప్పిన సీఎం హామీల అమలులో వైఫల్యం చెందారని ఆరోపించారు. తాజాగా ఎకరాకు రూ.12వేలే చెల్లిస్తామని చెబుతూ మళ్లీ కండీషన్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఎన్.వెంకటేష్, బొడ్రమోని యాదయ్య, బద్రీనాథ్‌గుప్త, జానీ పాషా, తదితరులున్నారు.

బోడకొండలో వ్యవసాయ సహకార బ్యాంక్ ఏర్పాటు చేయాలి


మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జయమ్మ, తదితరులు

మంచాల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడకొండలో వ్యవసాయ సహకార బ్యాంక్‌ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం నగరంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండెబోయిన జయమ్మ మల్లేశ్ ముదిరాజ్ కలిసి వినతిపత్రం అందించారు. బోడకొండలో బ్యాంక్ ఏర్పాటు చేస్తే లోయపల్లి, అంబోత్‌తండా, ఎల్లమ్మతండా, చీదేడ్, దాత్‌పల్లి, కొర్రోనితండా, సత్తితండా, రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే డీపీవోకు ఫోన్‌చేసి లోయపల్లినుంచి దాత్‌పల్లి వరకు సర్వే చేసి రైతులకు అన్నివిధాలా సౌకర్యంగా ఉన్న గ్రామంలో బ్యాంక్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఘనంగా 'హరిత పరివారం'



హరితపరివారం సమ్మేళనంలో ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు

ఆమనగల్లు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్మాస్‌పల్లి ది ఎర్త్ సెంటర్‌లో ఆదివారం ఘనంగా హరిత పరివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సమ్మేళనం అంబురాన్నంటింది. హరితపరివారం ఆత్మీయ సమ్మేళనం నేపథ్యంలో సీజీఆర్ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా 15 ఏళ్లుగా చేపడుతున్న పర్యావరణ పరిరక్షణపై చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పిల్లలు పతంగులు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం భోగిమంటలు వేసి సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, కోర్పోలు లక్ష్మారెడ్డి, లీలారెడ్డి, దిలీప్‌రెడ్డి, దొంతు నర్సింహారెడ్డి, శివప్రసాద్‌రావు, తులసీరామ్, ఇంద్రసేనారెడ్డి, వెంకట్‌రెడ్డి, అన్నమయ్య, రాజేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, సీజీఆర్ సభ్యులు ఉమామహేశ్వర్‌రెడ్డి, అన్నమయ్య, అనుదీప్, కోటయ్య, నగేశ్, లక్ష్మీప్రసన్న, హరిత పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న భూపాలచారి

చౌదరిగూడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజ్‌లో పార్టీ అధ్యక్షుడు కుర్మయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు కార్యకర్తలతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కందూరి కృష్ణారెడ్డి, రాష్ట్ర లీగల్‌సెల్ కోకన్వీనర్ మనోహర్‌రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు కోనేరు శ్రీనివాస్, నాయకులు మల్లేశ్, రాజు, ఎదిర రాజు, నర్సింహులు, యాదయ్య, అనిల్‌కుమార్, భీమయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడితే మరణశిక్ష వేయాలి



షాద్‌నగర్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): నిషేధిత డ్రగ్స్ వాడితే మరణశిక్ష విధించాలని సినీ నటుడు, ఆల్ ఇండియా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్ వ్యాఖ్యానించారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్స్‌లో 38వ ఆల్ ఇండియా కారాటే, కుంగ్‌ఫూ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడా మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి చూపడం శుభసూచకమన్నారు. క్రమశిక్షణ అలవాటు పడుతుందని చెప్పారు.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

యాచారం. జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. ఆదివారం యాచారంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ రద్దు చేయడంతో పాటు నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, బ్రహ్మయ్య, బాలరాజ్, పద్మ, మౌనిక, ఎండీ జహంగీర్, వినోద్‌కుమార్, థావ్‌నాయక్, చందూనాయక్, అంజయ్య పాల్గొన్నారు.


ద్వితీయ బహుమతి పొందిన ఇంద్రజకు రూ.4వేల నగదు పురస్కారం అందజేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్


తృతీయ బహుమతి పొందిన వై.మంజులకు రూ.3వేల నగదు పురస్కారం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నీరజా


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి విలేకరుల బృందం

ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు




సంస్కృతి, సంప్రదాయం ఉట్టి పడేలా వేసిన ముగ్గు

ముగ్గు.. మురిపెం

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ వారు మున్ముందు మరిన్ని పోటీలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చక్కటి ముగ్గులు వేశారని 138 మంది పాల్గొనడం అభినందనీయమన్నారు. పూర్వ కాలంలో సంక్రాంతి పండుగకు ముందు ప్రతీ ఇంటి ముందు ముగ్గులు వేసేవారని ఆ ముగ్గులను చూసేందుకు ఇంటింటికీ వెళ్లే వారమని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత కాలంలో ఆంధ్రజ్యోతి వేదిక ఏర్పాటు చేసి ముత్యాల ముగ్గు పోటీలు నిర్వహించడం మరిచిపోతున్న నాగరికతను మరోసారి గుర్తు చేస్తున్నారని ఆయన చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలియజేసే బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. అంతకు ముందు ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా మహిళల కోసం ముగ్గుల పోటీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ముగ్గుల పోటీలకు వచ్చిన మహిళలకు, విద్యార్థినిలకు, యువతులకు తాగునీరు, టిఫెన్ తదితరాలను కౌన్సిలర్ నీరజా బాల్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు నీరజ, సోమశేఖర్, పూజ, ప్రభాకర్‌గౌడ్, విజయాదేవి, మమత, ప్రవీణ్ గౌడ్, రాము, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభారాణి, మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాల, యువజన కాంగ్రెస్ నాయకులు వేణు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన ముగ్గులు

తాండూరులో నిర్వహించిన ముత్యాల ముగ్గులు ఆలోచింప చేశాయి. బ్రూణ హత్యల నివారణ, ఆధ్యాత్మిక ఉట్టిపడేలా వినాయకుడి బొమ్మలు, జై శ్రీరామ్, 33 జిల్లాలను చూపిస్తూ వేసిన తెలంగాణ ముగ్గు, సంక్రాంతి పండుగ ముందే వచ్చిదన్నట్టూ బొబ్బెమ్మలు, రైతులు, కాడెద్దుల బొమ్మలు ఆకట్టుకున్నాయి.


ముగ్గు వేస్తున్న దివ్యాంగురాలు


ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న సరళ శ్రీనివాస్‌రెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు



సంతూరు, సెల్సియా, క్రాఫ్ట్ వారి హ్యాంపర్‌ను అందజేస్తున్న ఆర్బీఎల్ ఎండీ సరళ శ్రీనివాస్‌రెడ్డి

న్యూస్ బాక్స్

నేడు కీసరగుట్ట ఆలయ చైర్మన్ ప్రమాణస్వీకారం


నారాయణ శర్మ

కీసర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కీసరగుట్ట ఆలయ చైర్మన్‌గా తటాకం నారాయణ శర్మ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వంశ పారంపర్యంగా వస్తున్న సంప్రదాయంలో భాగంగా తటాకం నాగలింగం శర్మ ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి సంవత్సర కాలం పూర్తి కావడంతో ఆయన పదవీకాలం ముగిసింది. తదుపరి ఆలయ చైర్మన్‌గా తటాకం నారాయణశర్మ బాధ్యతలు చేపట్టనున్నట్లు ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు ఆలయ మహామండపంలో జరిగే ప్రమాణాస్వీకరోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ప్రముఖులు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, విచ్చేయనున్నట్లు తెలిపారు.

నవాబుపేట ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళ పట్ల దుర్భాషలాడిన నవాబుపేట ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఎస్ఐపై ఆదివారం డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాదారం గ్రామానికి చెందిన ఓ మహిళా తన భూమి విషయంలో దౌర్జన్యం చేస్తున్న వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు.

7 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కులకచర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్లలో స్వర్గీయ బాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డిల స్మారకార్థం గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9490728512, 9381557413 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

కందనెల్లిలో భగవద్గీత పారాయణం

పెద్దేముల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కందనెల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో భగవద్గీత సంపూర్ణ పారాయణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తాండూరు గీతా సేవా సత్సంగ్ సమితి అధ్యక్షుడు నారాయణ, ప్రతినిధులు కలిసి 18 అధ్యాయాల భగవద్గీత శ్లోకాల పఠనం చేశారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

మోమిన్‌పేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ మాణిక్య ప్రభు మందిరంలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి సుధాకర్ ఆధ్వర్యంలో ఇరుముడులతో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

దోమ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుండాల తండాలో ఇటీవల జరిగిన దాడిలో గాయపడిన తండాకు చెందిన చందర్‌నాయక్‌ను హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి ఆదివారం చేరుకొని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలకు కేరాఫ్ కాంగ్రెస్


వికారాబాద్: ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ విమర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే మోసం చేసే పార్టీ అన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం రూ.12వేలు ఇస్తామని ప్రకటించడం ఏంటనీ ప్రశ్నించారు. దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు, రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని ఎద్దేవా చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఎన్.నర్సింహారెడ్డి, వెంకట్, అజీజ్ ఖాన్, శ్రీకాంత్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలుకు కట్టుబడి ఉండాలి

పరిగి: ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. పరిగిలో ఆదివారం జరిగిన సీపీఎం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు చెప్పి, రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.నర్సమ్మ, నాయకులు ఎండీ హబీబ్, సత్తయ్య,రఘురాం, లాలప్ప, రాంచంద్రయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతులకు మోసం

దౌల్తాబాద్: ఇందిరమ్మ రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీజేపీ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు సతీశ్ముదిరాజ్ ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎకరాకు రూ.15వేలు అందిస్తామని హామీ ఇచ్చి ఎకరాకు రూ.12వేలు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం దుర్మార్గమన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమంటే కోతలు విధించడమేనా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల మేరకు రైతులకు ఎకరాకు రూ.15వేలు అందించాలని లేని పక్షంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

'ప్రైవేట్'లో దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

మృతి చెందిన సంగతి విధితమే. బాలాజీ ఆస్పత్రిలో రెండు నెలల వ్యవధిలో ఇద్దరి మృతి చెందగా, బాధిత బంధువులు ఆందోళన కూడా చేశారు. నెల క్రితం ఓ ఆర్ఎంపీ దగ్గర ఊటుపల్లి చెందిన యువకుడికి సరైన వైద్యం అందక మృతి చెందారు. ఇలా ఒకటా, రెండా నెలలో ఒకరిద్దరు వచ్చిరాని వైద్యంతో మృతి చెందుతున్నారు.

అనుమతులు లేకుండా ఆస్పత్రుల నిర్వహణ

పరిగి పట్టణంలో అనేక ఆస్పత్రులు అర్హతలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్లు లేకుండా యథేచ్ఛగా నడిపిస్తున్నారు. కనీసం మెడికల్ ప్రాక్టీస్ సర్టిఫికెట్లు లేని ఆర్ఎంపీలు ఆస్పత్రులు కొనసాగుతున్నా వైద్యశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం పరిగిలోని రాఘవేంద్ర, హనుమాన్, గ్లోబల్, యాసిన్, పల్లవి తదితర క్లినిక్‌లను మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని గుర్తించారు. గ్లోబల్ క్లినిక్‌లో కనీస విద్యార్హతలు డాక్టర్‌గా చేలామణి అవుతున్న రాజు అనే వ్యక్తి క్లినిక్ నిర్వహించడాన్ని గుర్తించి క్లినిక్‌ను సీజ్ చేశారు.

ఎన్నిక ప్రకటించాక రాద్ధాంతమా?

ఘట్‌కేసర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించి ధ్రువపత్రాలు అందజేసిన తర్వాత కొందరు రాద్ధాంతం చేయడం సరికాదని సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు అన్నారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. గతనెల 22న సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో నిర్వహించి 12మందికి ధ్రువపత్రాలు అందజేశామన్నారు. అయితే వారం రోజుల అనంతరం ముగ్గురు కమిటీ సభ్యుల్లో ఇద్దరి ఆధ్వర్యంలో గతనెల 29న మరో సారి రీకౌంటింగ్ నిర్వహించి చెల్లని ఓట్లను కలిపి ఓడిపోయిన అభ్యర్థి భరత్ గెలిచినట్లు ప్రకటించడంపై విచారం వ్యక్తం చేశారు. తిరిగి వారం తర్వాత ఓడిన వ్యక్తిని గెలిచినట్లు ప్రకటించడాన్ని సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించి స్టేటస్‌ఉత్తర్వులు పొందినట్లు హరిప్రసాదరావు తెలిపారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారమే నడుచుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మెట్టు బాల్‌రెడ్డి, నాయకులు మెట్టు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి

కులకచర్ల: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండలంలోని పీరంపల్లిలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఉమ్మడి మండలంలోని 44గ్రామ పంచాయతీల్లో సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారని, ఇప్పటికి 90శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఘట్‌కేసర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మౌలికసదుపాయాల కల్పనకు కృషిచేయనున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో పాడైన కిటికీలకు తన సొంతంగా రూ.35వేలు వెచ్చించి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచారం మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు కాపాడుకోవాలి

పరిగి: సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పూడూరు మాజీ జడ్పీటీసీ ఎంపీ మేఘమాల ప్రభాకర్‌గుప్తలు అన్నారు. వారి ఆధ్వర్యంలో ఆదివారం పరిగి మార్కెట్ యార్డు ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మలిపెద్ది ప్రభాకర్‌గుప్త పాల్గొన్నారు.

యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్: నేటి యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేడు అందరికీ రాజ్యాంగమే రక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్ కుమార్, డాక్టర్ ఎం.మల్లేష్, దాసు, రాందాస్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చౌడాపూర్: మక్త వెంకటాపూర్‌లో నిర్మించనున్న శ్రీసేవాలాల్ మహారాజ్, మరియమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మందిపాల్ గ్రామానికి చెందిన కోకటం స్వర్ణలత శివశంకర్ దంపతులు విరాళం అందజేశారు. ఆదివారం తమ వంతు సాయంగా రూ.31వేలు విరాళం అందించారు.

శివాలయ నిర్మాణం పూర్తి



కులకచర్ల: కులకచర్లలో వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో దాతల విరాళాలతో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ఈ శివాలయంలో శివలింగం, నంది, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

క్రైం కార్నర్

ఆటో-బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కులకచర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కులకచర్ల నుంచి బండవెల్కిచర్లకు ఆదివారం సాయంత్రం ఆటో ప్రయాణికులతో వెళ్తోంది. ఈ క్రమంలో బండవెల్కిచర్ల మార్గంలో పాంబండ ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న పరిగి మండలం మల్లెమోనిగూడకు చెందిన గోపాల్, మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరిని 108 వాహనంలో పరిగి ఆస్పత్రికి తరలించారు.

విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ సంఘం కీసర మండల అధ్యక్షుడిగా రాఘవేంద్ర

కీసర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కీసర మండల విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడిగా ఉప్పులోజి రాఘవేందర్ ఎన్నికయ్యారు. కీసర పరిధి చీర్యాల్‌లో గ్రామంలో ఆదివారం విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ సంఘం కీసర మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఉప్పులోజి రాఘవేందర్‌చారి, ప్రధాన కార్యదర్శిగా సింగోజి చందు, కోశాధికారిగా కనకచారి, ఉపాధ్యక్షులుగా సంపత్‌చారి, కృష్ణచారి, ఉపకార్యదర్శిగా రవి, సలహాదారులుగా ప్రభాకర్‌చారి, బాలలింగచారి, నాగరాజు, చంద్రమౌళి, రాము, కుమార్, మురళి, ఆంజనేయులు, అశోక్ చారి, లక్ష్మణ్‌చారి, కృష్ణాచారిలను ఎన్నుకున్నారు.

రజక సంఘం కీసర అధ్యక్షుడిగా అశోక్


నియామకపత్రం అందుకుంటున్న అశోక్

కీసర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కీసర రజక సంఘం అధ్యక్షుడిగా జూపల్లి అశోక్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం రజక సంఘం కీసర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా జూపల్లి అశోక్, ప్రధాన కార్యదర్శిగా తంగళ్ళపల్లి భవాని శంకర్, ఉపాధ్యక్షుడిగా జూపల్లి రమేష్, కోశాధికారిగా జూపల్లి అశోక్, జాయింట్ సెక్రటరీగా పిడిశెట్టి శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా తంగళ్ళపల్లి కృష్ణ, జూపల్లి సాయిలు, జూపల్లి భిక్షపతిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు శాలువతో సత్కరించారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



దుద్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని ఈర్లపల్లి, లగచర్ల, పోలెపల్లి తదితర గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాల నిర్వాహణను ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.